### పార్లమెంట్ నియోజకవర్గాల

# పునర్ వ్యవస్థీకరణపై దేశవ్యాప్త చర్చ జరగాలి

### మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ వ్యవవస్థీకరణ (డీలిమిటేషన్) కేవలం సీట్ల పెంపు లేదా జనాభా లెక్కల అంశం కాదని, భారత సమాఖ్య వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రక్రియ అని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ప్రముఖ మార్క్సిస్టు నాయకులు పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా 41వ సార్మకోపన్యాసం ఖురేషి చేశారు. 'ప్రతిపాదిత డీలిమిటేషన్‌దక్షిణాది రాష్ట్రాల స్థితి' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సభకు సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘువులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ భారత్ వంటి విభిన్నత్వంతో కూడిన దేశంలో ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదని, అన్ని ప్రాంతాలకు సమాన రాజకీయ ప్రాతినిధ్యం లభించే విధంగా వ్యవస్థ కొనసాగాలన్నారు. దక్షిణాది




రాష్ట్రాలు జనాభా నియంత్రణ, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ముందంజలో ఉండగా, అదే కారణంగా భవిష్యత్తులో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 1971 జనాభా లెక్కల ఆధారంగా కొనసాగుతున్నాయని, 2027 జనగణన తర్వాత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు మార్గం సుగమం కానుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల్లో వ్యక్తమవుతున్న ఆందోళనలను విస్మరించరాదని తెలిపారు. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగిన జనాభాకు కూడా తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తికి ఒక ఓటు, ప్రతి ఓటుకు సమాన విలువ అనే సూత్రాన్ని కాపాడుతూనే సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టే సమతుల్య విధానం అవసరమని ఖురేషి సూచించారు. ఇందుకోసం జనాభా ప్రమాణాలతో పాటు మానవ అభివృద్ధి సూచీలు, జనాభా నియంత్రణలో సాధించిన పురోగతి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకునే మిశ్రమ విధానంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి సమాఖ్య దేశాల్లో అమలులో ఉన్న ప్రాతినిధ్య నమూనాలను ఉదాహరణగా ప్రస్తావించిన ఆయన, భారతదేశం కూడా తన పరిస్థితులకు అనుగుణంగా పరిష్కార మార్గాన్ని రూపొందించుకోవాలని సూచించారు.డీలిమిటేషన్ ప్రక్రియపై తొందరపాటు నిర్ణయాల కంటే విస్తృత చర్చలు, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు, రాజకీయ ఏకాభిప్రాయం ఆధారంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా 'నా సొంతగడ్డపైనే నేనొక పరాయివాణ్ణి' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యుడు జి.బుచ్చిరెడ్డి, నవతెలంగాణ పత్రిక ఎడిటర్ కె.ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.

### జలమండలి కార్మికుల సంక్షేమం

# ఐఎన్‌టియుసి వల్లే సాధ్యం

### త్రిశూలం గుర్తుకు ఓటు వేయండి : మొగుళ్ళ రాజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అనేక దశాబ్దాలుగా కార్మికుల సమస్యల పరిష్కారం కొసం పాటుపడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించిన ఐఎన్‌టియుసి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి కార్మికులను కోరారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని విఎస్‌టి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొగుళ్ళ రాజిరెడ్డితో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యే కాలే యాదయ్య, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు చల్ల నరసింహ రెడ్డి, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, యరగోని నాగన్న గౌడ్, అదిల్ షరీఫ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు కె. రాజి రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం జలమండలి కార్మికుల పట్ల కర్కశత్వంగా వ్యవరించడంతో పాటు యూనియన్ అధ్యక్షులుగా జి. రాంబాబుయాదవ్ ఉన్నప్పుడు కార్మికుల ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోకుండా అన్యాయం చేసారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గుర్తింపు సంఘం నాయకునిగా జలమండలిలోని వివిధ పనుల కాంట్రాక్టులను తానే సొంతం చేసుకొని, ఆర్థికంగా రూ.కోట్లకు పడగలెత్తాడని విమర్శించారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోరే కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టియుసి తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చల్ల నరసింహ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టియుసి తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపిస్తే భవిష్యత్తులో కార్మికుల సమస్యలు సులభంగా పరిష్కారామవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నేతలు మహేష్, అక్తర్ అలీ, విశ్వనాథ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఐఎన్‌టియుసికి ఎఐటియుసి మద్దతు**

జూన్ 6న జరిగే జలమండలి ఎన్నికల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై ఐఎన్‌టియుసికి ఎఐటియుసి మద్దతు ప్రకటిస్తున్నదని మంగళవారం జరిగిన ఎఐటియుసి అనుబంధ హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సేవరేజ్ బోర్డు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రిజిస్టర్ నెంబర్ బి 1934 ప్రకటించింది. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ జలమండలిలో గత నాలుగు సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పెరిగిపోతున్నాయని, జలమండలిలో పనిచేయుచున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఐఎఫ్ఎంఎస్ పోస్టర్‌లో చేర్చి, సంస్థ ద్వారానే జీతాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేయాలన్నారు. ఐఎన్‌టియుసి తరఫున పోటీ చేస్తున్న మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ ఎఐటియుసి ఇచ్చిన డిమాండ్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి నిదర్శనంగా ఉన్నాయన్నారు. గత యూనియన్ లా కాకుండా ఐఎన్‌టియుసి యూనియన్ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని ఎఐటియుసి మద్దతు తెలియజేసినందుకు వారి సంఘానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఆర్.డి.చంద్రశేఖర్, రాఘవేందర్ రాజు, ఎఐటియుసి యూనియన్ అధ్యక్షులు కె.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. సత్యనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి జి.బి. సర్వేశ్వర్ రావు, కోశాధికారి జి. ఆనంద్, అశోక్, దాస్, ఎ.మురళి, ఆర్.జంగయ్య, ఏం. బాబు తదితరులు పాల్గొన్నారు

# అధిక ఉష్ణోగ్రతలతో అట్టుడుకుతున్న భారత్

### దేశవ్యాప్తంగా మండుతున్న ఎండలు

### 48 డిగ్రీలకు చేరిన ఉష్ణోగతలు

**న్యూఢిల్లీ :** దేశం ఎండ వేడిమితో అట్టుడుకుతోంది. అనేక ప్రాంతాల్లో గతంలో ఎప్పుడూ లేని ఎండలు నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో గరిష్టంగా 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకర స్థాయి. దేశ రాజధాని ఢిల్లీతోపాటు మహారాష్ట్రలోని విదర్భలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు ఈ ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు.

రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగి, వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. మహారాష్ట్రలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విదర్భ, అమరావతి పట్టణాల్లో 46.8 డిగ్రీలు, వార్ధాలో 46.5 డిగ్రీలు, అకోలాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇతర పట్టణాల్లో కూడా ఇదే స్థాయిలో టెంపరేచర్ పెరుగుతోంది. మహారాష్ట్ర, ఢిల్లీలాంటి చోట్ల ఇప్పుడప్పుడే ఎండలు తగ్గే అవకాశం లేదని ఐఎండీ హెచ్చరించింది. అనేక ప్రాంతాల్లో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రాంతంలో ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

ఢిల్లీలో ఉష్ణోగ్రతలతోపాటు వాయు కాలుష్యం కూడా కలవరపెడుతోంది. ఈ వారం అంతా నార్త్ ఇండియా, సెంట్రల్ ఇండియా, వెస్టర్న్ ఇండియాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. భారీ ఎండల నేపథ్యంలో ఐఎండి.. ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, ఎండ ప్రభావానికి గురి కాకుండా చూసుకోవాలని, ఇండ్లలోనే ఉంటూ తగినన్ని నీళ్లు తాగాలి, ముఖ్యంగా పగటి పూట బయటకు వెళ్లొద్దని సూచించింది.

### న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సుకు పుతిన్

**మాస్కో:** న్యూఢిల్లీలో ఈ ఏడాది సెప్టెంబరు12-13 తేదీల్లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరవుతారు. వంతులవారీ పద్ధతి ప్రకారం బ్రిక్స్‌కు భారత్ ప్రస్తుతం అధ్యక్ష బాధ్యతల్లో ఉంది. సెప్టెంబరులో జరిగే వార్షిక బ్రిక్స్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుంది. రష్యా ప్రభుత్వ కేంద్ర కార్యాలయం క్రెమ్లిన్‌లో పుతిన్ అంతర్జాతీయ వ్యవహారాల సహాయకుడు యూరీ ఉషకోవ్ మంగళవారం చెప్పిన సమాచారం ప్రకారం, భారత్‌లో బ్రిక్స్ సదస్సుకు పుతిన్ హాజరవుతారు.



### జూన్ 1న 'చలో సిఎం క్యాంప్ ఆఫీస్'

### రాష్ట్ర సర్పంచుల సంఘం జెఎసి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయం ముట్టడికి తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జెఎసి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ పిలుపునిచ్చారు. యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్తూపం వద్ద మీడియాతో మాట్లాడారు. మాజీ సర్పంచులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన రాలేదన్నారు. అలాగే ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో 11 సార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మాజీ సర్పంచుల పదవీకాలం ముగిసి 32 నెలలు గడిచినా అభివృద్ధి పనుల బిల్లులు విడుదల కాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనికి నిరసనగా జూన్ 1న చలో సిఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. పెండింగ్ బిల్లులు రావాల్సిన మాజీ సర్పంచులందరూ భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, వై. అరవింద్ రెడ్డి, ఆనబోయిన సుధాకర్, గౌరీ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గంధం మల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లపై

# తప్పుడు ప్రచారం తగదు

### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొడంగల్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేసే ముందు అధికారిక లెక్కలు పరిశీలించాలని, అవసరమైతే సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించాలని సూచించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.6,462.73 కోట్ల చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. పదే పదే అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.వికారాబాద్ జిల్లాలో మే రెండో వారంలో వరి కోతలు ప్రారంభమయ్యాయని, ఇప్పటివరకు 3,608 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో 15,186 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.21.43 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైస్ మిల్లర్లపై ఎలాంటి ఫిర్యాదులు లేవని, గన్నీ బ్యాగుల పేరుతో రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలను ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 రబీ సీజన్‌కు 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 18 నాటికి 40.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని వెల్లడించారు. గత రబీ సీజన్లతో పోలిస్తే ఈసారి కొనుగోళ్లు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం రైతు సంక్షేమంతో పాటు పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, పేదలకు సన్న బియ్యం, రేషన్ కార్డులు, రూ.2 లక్షల రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

## తల్లీకూతుర్ని హత్య చేసిన నిందితుల అరెస్ట్

### విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన రుద్రాక్షి సుమలత(45) హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. కుటుంబ భూవివాదాలు, ఆస్తి పంపకాల విషయంలో ఏర్పడిన విభేదాల కారణంగా నిందితులు పూర్వ ప్రణాళిక ప్రకారం హత్యకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది. మృతురాలు లావణ్య పేరు మీద ఉన్న సుమారు 5.24 ఎకరాల భూమిని భూమిని స్వాదీనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో నిందితులు ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితులు తల్లికూతుళ్ల హత్యకు పన్నిన కుట్ర ప్రకారం ఈనెల 17న ఉదయం మృతులు రుద్రాక్షి సుమలత, ఆమె కుమార్తె రుద్రాక్షి లావణ్యలు ఇబ్రహీంపేట గ్రామ శివారులో గల పామాయిల్ తోట వద్దకు పని నిమిత్తం వెళ్లగా నిందితులు అయిన గుర్రం నవీనీత, అంగడి రణుక, గుండ్లపల్లి స్వామి, గుర్రం రమేష్, రుద్రాక్షి మహేష్, నిమ్మల శశికళ, నిమ్మల వెంకన్న, రుద్రాక్షి నరసింహాలు ఏడుగురు వారిని వెంబడించి హఠాత్తుగా దాడిచేసి కారం పొడి చల్లి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం పరారైన నిందితులు హాలియా పోలీసులు సాంకేతిక ఆధారాలు, సెల్‌ఫోన్ వివరాలతో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నేరస్తులకు హత్యకు ఉపయోగించిన బైక్, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాదీనం చేసుకోగా నిమ్మల శశికళ, నిమ్మల వెంకన్న, రుద్రాక్షి నరసింహాలు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటుమాన్నారు. ఎస్‌పీ ఆదేశాల మేరకు సీఐ బి.శ్రీనునాయక్ పర్యవేక్షణలో త్రిపురారం, హాలియా ఎస్‌ఐలు నరేష్, సాయిప్రశాంత్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది కృష్ణ, కోటి, శివ, ముని, వెంకటేశ్వర్లు, రమేష్‌లు నిందితులను పట్టుకున్నారని అన్నారు.

## గడువుకు ముందే నక్సలిజాన్ని నిర్మూలించాం




### అమిత్ షా

**జగదల్‌పూర్ :** భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, అత్యున్నత త్యాగాల ఫలితంగా, మార్చి 31 గడువు తేదీ కంటే ముందే దేశం నుండి నక్సలిజం పూర్తిగా నిర్మూలించబడిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం తెలిపారు. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షా మాట్లాడారు. నక్సల్ రహిత భారతదేశం సాధించే ప్రచారంలో కొన్ని తేదీలకు చారిత్రక ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. అందులో మొదటిది డిసెంబర్ 13, 2023; ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన ఆ రోజు నుండే నక్సలిజం పూర్తి నిర్మూలన కోసం దృఢమైన పోరాటం ప్రారంభమైందని ఆయన తెలిపారు. రెండవ తేదీ ఆగస్టు 24, 2024 అని షా చెప్పారు. మార్చి 31, 2026 నాటికి దేశాన్ని నక్సల్ రహితంగా మార్చాలనే సంకల్పంతో, అన్ని రాష్ట్రాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజి) అధికారులతో ఆ రోజున ఒక సమావేశం నిర్వహించబడిందని ఆయన వివరించారు. మూడవ తేదీ మీ అందరికీ తెలిసినదే మార్చి 31, 2026 (దేశం నుండి నక్సలిజాన్ని నిర్మూలించడానికి కేంద్రం విధించిన గడువు) అని అన్నారు. భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, అత్యున్నత త్యాగాల కారణంగా, నిర్ణీత గడువు కంటే ముందే దేశం నుండి నక్సలిజం పూర్తిగా నిర్మూలించబడిందని షా విలేకరులతో అన్నారు. నక్సలిజం నిర్మూలన ప్రణాళికలలో కేంద్ర ప్రభుత్వానికి వివిధ రాష్ట్రాల్లోని అనేక బిజెపియేతర ప్రభుత్వాలు సహకరించాయని, అయితే ఛత్తీస్‌గఢ్‌లోని గత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎటువంటి సహకారం అందించలేదని తాను ఎటువంటి సంకోచం లేకుండా చెప్పగలనని హోం మంత్రి పేర్కొన్నారు. డిసెంబర్ 2023 తర్వాత, ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే, మేము బస్తర్ ప్రాంతంలో నక్సలిజాన్ని నిర్మూలించగలిగామన్నారు. ఈ ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు చేరకపోవడం వల్లే నక్సలిజం విస్తరించిందని, కొందరు మేధావులు ఏళ్లుగా వాదిస్తున్నారని మంత్రి ప్రస్తావించారు. 'కానీ వాస్తవం దీనికి పూర్తిగా విరుద్ధం... ఆ ప్రాంతాల్లో నక్సలిజం ఉండటం వల్లే అభివృద్ధి అక్కడికి చేరలేకపోయింది' అని ఆయన స్పష్టం చేశారు. నక్సలైట్ల కారణంగా, ఆ ప్రాంతం మొత్తం అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడిపోయిందని హోం మంత్రి తెలిపారు. వారికి రేషన్ కార్డులు లభించలేదు, ఉచిత ఆహార ధాన్యాల పథకం ప్రయోజనం దక్కలేదు, అలాగే రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కూడా వారు పొందలేకపోయారు, ఉపాధి అవకాశాలు అసలు ఎక్కడా కనిపించలేదు అని ఆయన వివరించారు. దేశంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల కంటే కూడా ఆర్థికంగా, సామాజికంగా మరింత వెనుకబడిన ప్రాంతాలు చాలా ఉన్నాయని, అయినప్పటికీ ఆ ప్రాంతాల్లో నక్సలిజం లేదని ఆయన పేర్కొన్నారు.

### సైనిక-సాంకేతిక, వ్యవహార దక్షతలకు

# సంపూర్ణ ప్రతిబింబమే ఆపరేషన్ సిందూర్

### ఆర్మీచీఫ్ ఉపేంద్ర ద్వివేది

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ భారతదేశ సైనిక-ఆధునిక సమాచార సాకేంతిక, ఆర్థిక,దౌత్యపరమైన శక్తిసామర్థ్యాలకు, వ్యవహార దక్షతకు సంపూర్ణ ప్రతిబింబమని సైనిక బలగాల ప్రధానాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేదీ చెప్పారు. సందర్భశుద్ధితో, చాలా పొందికగా, పొదుపుగా దేశ ప్రయోజనాలకు అనుగుణంగా గురిపెట్టి ఉగ్రవాద మౌలిక లక్ష్యాలను ధ్వంసం చేశామని చెప్పారు. న్యూఢిల్లీ మానేక్ షా సెంటర్‌లో దేశ సౌభాగ్యం కోసం భద్రత-స్థిరమైన జాతీయ వృద్ధికోసం ''స్మార్ట్ పవర్'' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ భారత బలగాలు ఉగ్రవాదశక్తుల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశాయని, దీర్ఘకాలికంగా ఉగ్రవాదులు చేసిన వ్యూహాత్మక అంచనాలకు తూట్లుపొడిచి చిందర వందర చేసిందని ఆ తర్వాత ప్రయోజనం నెరవేరిన తర్వాత ఉద్దేశపూర్వకంగా 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేసిందని చెప్పారు. ఒక వైపు భారత సైనిక శక్తిసామర్థ్యాలను, మరోవైపు వివేకంతో కూడిన దౌత్యనీతిని కలగలిపి జాతీయ లక్ష్యాలను సాధించడానికి ఉద్దేశించిన ఒక వ్యూహాత్మక విధానాన్ని ఈ ''స్మార్ పవర్'' సంపూర్ణస్థాయిలో ప్రతిబింబించిందని చెప్పారు. సైనిక సామర్థ్యం-సాంకేతిక, దౌత్య సామర్థ్యాలను ఉమ్మడిగా కలగలిపి ఏ విధంగా ఆ స్మార్ట్ పవర్‌ను ప్రతిబింబించాలన్న ప్రశ్నకు ఒక పాక్షిక సమాధానాన్ని పన్నెండు నెలల క్రితం భారత దేశం తెలియజేసిందని చెప్పారు. 2025 మే ఆరోతేదీ రాత్రి పొద్దుపోయాక ఏడో తేదీ తెల్లారకముందుగానే భారతదేశం సరైన చర్యలు తీసుకుందని చెప్పారు. చాలా సంక్షిప్తంగా, లక్ష్యాలను గురిచూసి 22 నిమిషాల వ్యవధిలోనే ఆపరేషన్ విండో, ఆపరేషన్ సిందూర్‌ను సైనిక బలగాలు పూర్తిచేశాయని చెప్పారు. ఒక వైపు సైనికులు లక్ష్యాలను గురిచూసి దాడి చేస్తుంటే, సమాచార నియంత్రణ,దౌత్యపరమైన సంకేతాలతో ఆర్థిక పరిష్కారాలకు ఆపరేషన్ సిందూర్ ఒక సంపూర్ణ ప్రతిబింబంగా నిలిచిందని అన్నారు. శత్రుదేశం లోలోతుల్లోకి చొరబడి ఉగ్రవాద మౌలిక వ్యవస్థను ధ్వంసం చేశామని, ఉగ్రవాదులు దీర్ఘకాలికంగా వ్యూహాత్మకంగా కన్నకలలను ఛిద్రం చేశామని చెప్పారు. 88 గంటలసేపు చాలా జాగ్రత్తగా వివేకంతో ఉద్దేశపూర్వక ఆలోచనలతో వ్యవహరించి భారత దేశ సమ్మిళిత ''స్మార్ట్ పవర్''ను సంపూర్ణ స్థాయిలో వ్యక్తీకరించామని చెప్పారు. పరికరాలను చాలా చక్కగా పొందిగా లక్ష్యంవైపు గురిచూసి ఉపయోగించామని, ఇదెంతో వ్యూహాత్మకమైన చర్య అన్నారు.

దేశ రక్షణరంగ బుద్ధిజీవుల యుద్ధ నైపుణ్య అధ్యయనాల కేంద్రం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది.



సీనియర్ సైనిక అధికారులు,వివిధ రంగాలకు చెందిన సైనిక అధికారులు,అనేక దేశాలకు చెందిన ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. మన చుట్టూ ఉన్న ప్రపంచం ఇప్పుడు ఎంతో సంక్లిష్టమైన సంకేతాలను ఇస్తోంది, అశాంతి,క్రమరాహిత్యం,అపనమ్మకం,అవిశ్వాసం, మిత్రపక్షాలు,కూటములలో ద్వైధీభావాలు కనిపిస్తున్నాయి, అధికార రాజకీయాలను ఉపయోగించుకుని సౌభాగ్యాన్ని,సమృద్ధినీ పునర్వవస్థీకరించి,వృద్ధిని కేంద్రీకరించే ప్రపంచం మనకు ఉందని, కానీ దానికి బదులుగా మనం అధికార సమృద్ధి ఉన్నచోట అధికార రాజకీయాలు చెల్లుబాటు కాబోవని అలాంటి ప్రపంచం ఉంటుందని మనం స్మార్ట్ పవర్ ద్వారా చాటి చెప్పామన్నారు. స్థిరమైన జాతీయ వృద్ధికోసం స్మార్ట్ పవర్ ఒక నిర్ణయాత్మక సాధనంగా ఉంటుందా లేక రాక్షస బలం తిరిగి ప్రపంచంలో కేంద్ర స్థానాన్ని ఆక్రమిస్తుందా? అని ఆయన ప్రేక్షకులను ప్రశ్నించారు. ప్రపంచం యథాతథంగా ఉన్నప్పటికీ ఒకే ఉద్దేశాలు, ఒకే కోరికలు,ఆశయాలు మాత్రం ప్రపంచానికి లేవని ఆయన హెచ్చరించారు. 21వ శతాబ్దంలో వాణిజ్యం,సరఫరా వ్యవస్థలలు,అదనపు అనుసంధానాల శక్తులు దేశాల మధ్య స్వతంత్రకు సంఘర్షణగా ఉన్నాయని అన్నారు. అదేసమయంలో ఈ దేశాలన్నీ ఒక్కటిగా కలిసి ఉన్నాయన్నారు. హోర్ముజ్ జలసంధి ఇప్పుడు ప్రపంచంలో అతిపెద్ద కేంద్రస్థానాన్ని ఆక్రమించిందని, ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయాలు కూడా 2.70 ట్రిలియన్ డాలర్లు దాటిపోయిందని, ఈ వ్యయం ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల బడ్జెట్‌ను దాటి పోయిందన్నారు. భద్రత, దేశ సమృద్ధి, సౌభాగ్యం మధ్య సరిహద్దులు ఇంకెంతోకాలం సరిహద్దుగా ఉండవన్నారు. భద్రతా వ్యయం ఇక దేశ సమృద్ధికి ఒక ముందస్తు షరతుగా మారుతుందన్నారు. భారతదేశంలో జాతీయతాబలం,వ్యూహాత్మక వివేకం శాంతిని కాపాడతాయని, వృద్ధిని వేగవంతం చేస్తాయని, ప్రపంచ వాతావరణాన్ని మనకు అనుకూలంగా మలుస్తాయని అన్నారు.

